క్లుప్తంగా

27న బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): మండలంలో బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. అభ్యర్థులు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

పిల్లల్లో అభ్యసన స్థాయిని పెంపొందించాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ హేమలత తెలిపారు. మండలంలోని తవణంపల్లె దిగువ అరుంధతివాడ ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులు చదవడం, రాయడంపై పట్టు సాధించేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు వాయిదా

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన బీసీ, కార్పొరేషన్ల రుణాల ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకర్ల అభ్యర్థన మేరకు ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నామని.. త్వరలోనే తదుపరి తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

డీఈగా బాధ్యతలు స్వీకరించిన బాలాజి



బాలాజీని అభినందిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో హెచ్‌టీ, సీటీ మీటర్స్ విభాగం డీఈగా బాలాజి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఈగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఆయన గిరింపేట, ఐరాల ఏఈగా పనిచేశారు. ఆయన్ను ఎంఆర్‌టీ ఈఈ వాసుదేవరెడ్డి, స్టోర్స్ డీఈ వసంతనాయుడు, ఓసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు చంద్రమౌళి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

26న చీకూరుపల్లెలో కబడ్డీ పోటీలు

బంగారుపాళెం: మండలంలోని చీకూరుపల్లెలో బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 8686746475, 9652246052ను సంప్రదించాలని కోరారు.

ఇంధన సంరక్షణ ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న సైక్లిస్టులు

చిత్తూరు కలెక్టరేట్: ఇంధన సంరక్షణ ముఖ్యమని సైక్లిస్టు ఉదయ్ కార్తికేయన్ అన్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం సైక్లోథాన్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సైక్లిస్టులు ఇంధన సంరక్షణ, వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంధన సంరక్షణ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు సైకిలిస్టులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కార్వేటినగరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సచిన్ టెండూల్కర్, హుస్సేన్ బోల్ట్ ఉన్నత విద్యను అభ్యసించక పోయినా వారు ఎంచుకున్న రాణించి అంతర్జాతీయస్థాయికి ఎదిగారన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ నరసింహ కళాశాల డైరెక్టర్లు దిలీప్‌కుమార్, వెంకటేష్, ధనంజయరెడ్డి, పురుషోత్తం, రమణ, ప్రిన్సిపల్ కిషోర్ పాల్గొన్నారు.

సమాధి ఫొటో తీసుకురండి

ఫ్యామిలీ సర్టిఫికెట్ మంజూరులో రెవెన్యూ సిబ్బంది తిరకాసు

- కాసులిస్తేనే రెవెన్యూ సేవలు
- దాగుడుమూతలాడుతున్న వీఆర్వోలు
- నెల రోజులుగా బాధితుల ప్రదక్షిణలు
- చోద్యం చూస్తున్న అధికారులు



చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం

పూర్వీకుల సంతకాలు ఏవీ?

చిత్తూరు మండలం తాళంబేడు గ్రామానికి చెందిన వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా తిరుగుతున్నారు. ఓ బ్యాంకు సేవల నిమిత్తం ఈ పత్రం అవసరమొచ్చింది. దీంతో ఆ కుటుంబం మీ సేవ కేంద్రంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుకు కుటుంబ పెద్దల మరణ ధృవీకరణ పత్రం, ఇతరత్రా ఆధార నకలు పత్రాలను జోడించారు. ఆ పత్రాన్ని తీసుకెళితే, కార్యాలయానికి ఒకటికి పది సార్లు తిప్పించుకున్నారు. మళ్లీ కుటుంబ సభ్యుల్లోని అందరి సంతకాలను తీసుకురమ్మన్నారు. ఆ తర్వాత వెళ్లి కలిస్తే పూర్వీకులుంటే వారి సంతకాలు తెమ్మన్నారు. ఇదిపోను తండ్రి సమాధి ఫొటో తీసుకు రమ్మని చెప్పారు. చివరకు ఈ ప్రక్రియ పూర్తి చేసి ఆర్ఐ దగ్గరకు సంతకం కోసం వెళితే ఆ దరఖాస్తును అర్జీదారు అయిన మహిళ ముఖం మీదకు విసిరేశారు. నెల రోజులుగా తిరుగుతున్నా కనీసం దరఖాస్తు కూడా స్వీకరించలేదు. ఇలా ఇది ఒక్కటే కాదు.. వందల సంఖ్యలో దరఖాస్తులు మూలన పడిఉన్నాయి.

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులో రెవెన్యూ సేవలు కాసులకు అమ్ముడుపోతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలకు మరిగి ప్రజలను ముప్పుతిప్పలు పెడతున్నారు. కొందరు వీర్వోలు కంటికి కనిపించకుండా దాక్కుని తిరుగుతున్నారు. కార్యాలయ సిబ్బంది బాధితులను నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. దీంతో ప్రజలకు పలు రెవెన్యూ పత్రాలు పట్టాలంటే ప్రాణంపోతోంది. తిరిగి తిరిగి అలసట వచ్చేస్తోంది. ఓపిక నశించి..చివరకు వారు కోరిన డబ్బులు తెచ్చి ఇచ్చేస్తున్నారు. డబ్బు ముట్టగానే పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ తతంగం అంతా తెలిసినా మండల రెవెన్యూ ఉన్నతాధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చిత్తూరు నగరంలో అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది పలు సేవల కోసం వస్తుంటారు. అధికంగా మ్యుటేషన్, కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు, దారి సమస్యలు, భూ తగాదాలు ఇతరత్రా సమస్యలు, సేవల నిమిత్తం అధికంగా ఆశ్రయిస్తుంటారు. అయితే తహసీల్దార్ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం పూర్వీకుల సంతకాలు, సమాధి ఫొటో తీసుకురమ్మని చెప్పడం గమనార్హం.

సిఫార్సు ఉంటేనే.. లేకుంటే తిరకాసు

కార్యాలయంలో ఏ పని చేసుకోవాలన్నా... ఓ అధికార పార్టీ నాయకుడి సిఫార్సు ఉండాలి. లేదంటే జేబులో డబ్బు అయినా ఉండాలి. ఒక్కో సేవకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మ్యుటేషన్, పత్రాల జారీ, సర్వే, ఇతరత్రా వాటికి బాగా తిప్పించుకుని..ఆ పనికి డిమాండ్ వచ్చేలా ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే ఆ పత్రాన్ని ఆన్‌లైన్‌లో రిజెక్ట్ చేస్తారు. లేకుంటే కుంటి సాకులు, సవాలక్ష నిబంధనలు చెప్పి అక్కడి నుంచి తరిమేస్తున్నారు. ఇలాంటి బాధితులు జిల్లా కలెక్టర్, జేసీని కలసి విన్నవించినా ఫలితం మాత్రం శూన్యం.

చర్యలు తీసుకుంటాం

ప్రజా సేవల్లో అమర్యాదగా ప్రవర్తించిన సిబ్బంది, అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విధిగా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజలను పదే పదే తిప్పించుకోవడం కరెక్టు కాదు. పద్ధతి మార్చుకుని పనిచేయాలి. కార్యాలయాల్లో ఉన్న అధికారులు సమస్యలు, సేవల కోసం వచ్చే ప్రజలకు సకాలంలో సేవలను అందించాలి.

–శ్రీనివాసులు, ఆర్డీఓ, చిత్తూరు

ఇప్పుడు కాదు.. రేపు రాపో చూద్దాం

రెవెన్యూ వ్యవస్థను కొందరు వీఆర్వోలు భ్రష్టు పట్టిస్తున్నారు. ఉదయం 10 గంటలకే కేటాయించిన సచివాలయాల్లో అటెండెన్స్ వేయాల్సి ఉంది. అయితే వారు అదనపు పనులు, సమావేశాలు, సర్వేలు ఇతరత్రా సాకులు చూపి కేటాయించిన ప్రాంతాలకు పూర్తిగా ముఖం చాటేశారు. చుట్టపు చూపుగా కూడా రావడం మానేశారు. కొంత మంది నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలోనే కాలం వెళ్లదీస్తున్నారు. అర్బన్ కార్యాలయంలోని ఎన్నికల విభాగం, ఏఎస్ఓ గదిలోనే చాలా మంది వీఆర్వోలు తిష్ట వేస్తున్నారు. రూరల్ కార్యాలయంలోని ఓ గదిని కేటాయించుకున్నారు. మరికొంత మంది ప్రైవేటు కార్యాలయాల్లోనే కునుకుతీస్తున్నారు. దీంతో ఆ వీర్వోలను పట్టుకోవాలంటే ప్రజలకు సవాల్‌గా మారింది. లేకుంటే కార్యాలయం వద్దకు వారి వచ్చినప్పుడు కలిసి సంతకాలు తీసుకోవడం, సమస్యలు చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక కార్యాలయ సిబ్బంది పేదలంటే చిన్న చూపు చూస్తున్నారు. వాళ్ల పనులంటేనే ఛీకొడుతున్నారు. దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడు కాదయా..రేపు రాపో చూద్దాం అని గదమాయిస్తున్నారు. దీంతో చేసేది లేక పేద ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు.



కార్యాలయంలో వీఆర్వోల సందడి

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం





శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీకాలభైరేశ్వర స్వామి, అన్నాభిషేకంలో శివలింగం

- శ్రీ కాలభైరేశ్వర ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం
- శివలింగానికి అన్నాభిషేకం, పూజలు

తవణంపల్లె: మండల కేంద్రంలోని శ్రీ కాలభైరేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఆలయంలో ఉభయదారులచే స్వామివారికి, శివలింగానికి, నందీశ్వరునికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా జరగాలని అర్చకులు విభాకశాస్త్రి, పూజారి సుబ్రమణ్యం ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలోని పార్వతీదేవి, అంకాలపరమేశ్వరి, శనీశ్వరస్వామి ఆలయాన్ని సుగంధపుష్పాలతో సుందరంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయదారులు సాలికులస్థులు, కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

శేషవాహనంపై కాలభైరవుడి విహారం

శ్రీ కాలభైరేశ్వర స్వామికి సోమవారం రాత్రి ఉభయదారులు గోనెపల్లె ఎస్.జగదీశ్వరనాయుడు కుటుంబసభ్యులచే శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలతో ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తి కాలభైరేశ్వరుడికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి హారతులిచ్చారు. సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో శేష వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళ హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో మంగళవారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. రాత్రి నంది వాహన సేవను నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

వినాయక స్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం





ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన దాతలు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలోని నిత్య అన్నదానానికి సోమవారం దాతలు నగదు విరాళం అందించారు. కర్ణాటకకు చెందిన రామకృష్ణారావు రూ.లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మణికంఠ రూ.1,01,116ను ఆలయ అధికారులకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ .. గంటల పాటు నిరీక్షణ



నత్తనడకన జరుగుతున్న రోడ్డు పనులు

గుడిపాల: రైల్వేగేట్ పడితే చాలు గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. మండలంలోని చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారి నంగమంగళం వద్ద కాట్పాడి–తిరుపతి రైల్వేట్రాక్ ఉన్నది. ప్రస్తుతం ఇక్కడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిని ఏర్పాటుచేసేందుకు పనులు మొదలెట్టారు. ఈ పనులు సంవత్సర కాలంగా సాగుతున్నా ముందుకు మాత్రం వెళ్లడం లేదు. నత్తకంటే నిదానంగా కదులుతున్నాయి. అయితే ఇలా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డును వారు నిర్మించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ రోడ్డుమార్గం చూపకుండా సింగిల్‌రోడ్డును ఏర్పాటు చేశారు. తరచూ ఈ మార్గం వైపు వేలాది వాహనాలు ప్రతిరోజూ ప్రయాణిస్తుంటాయి. ఒక్కోసారి రైల్వేగేట్ పడితే ఇరువైపులా వాహనాలు నిలిచి గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయంగా రోడ్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



గేట్ పడడంతో బారులు తీరిన వాహనాలు

పిల్లలకు అర్థమయ్యేలా బోధించండి



ఎన్‌జీఓ సభ్యులను సన్మానిస్తున్న ఎంఈఓలు

ఐరాల: అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటలు, పాటల రూపంలో అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు చివరి రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పునాది దశలో విద్యను బలోపేతం చేయడం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు పునాది లాంటిదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రీస్కూల్ నిర్వహణపై రిసోర్స్ పర్సన్స్ అరుణ్‌కుమార్, జనార్దన్, సుధాకర్, రేఖ శిక్షణ ఇచ్చారు. ధ్యానం ఆవశ్యకతను అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్‌జీఓ సభ్యులు వీరరాఘవులునాయుడు, కృష్ణమనాయుడు వివరించారు. అనంతరం ఎన్‌జీఓ సభ్యులను ఎంఈఓలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



పరిష్కార వేదికపై పాల్గొన్న అధికారులు

తవణంపల్లె: రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం అధికారులు హాజరయ్యారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ మత్యంలో భూముల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని రైతు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. కట్టకిందపల్లె ఎస్టీ కాలనీ శ్మశాన దారిని సర్వే చేసి సరిహద్దులు చూపించాలని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ రెడ్డి, వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 110 మందికి వైద్య సేవలు





కొత్తకోట, బట్టువాళ్లూరులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పూజిత, డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నట్లు గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు చంద్రమహేష్, పూజిత తెలిపారు. బట్టువాళ్లూరులో సోమవారం డాక్టర్ చంద్రమహేష్, కొత్తకోటలో డాక్టర్ పూజిత ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మధుమేహం, బీపీలతో ఇతర వ్యాధులకు సంబంధించి 110 మందికి వైద్యసేవలను అందజేసి వారికి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, శశికళ, యమున, రాధ, దేవప్రీత, తేజు, ఇందు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో ఘనం.. ఆచరణ శూన్యం

చిత్తూరు కార్పొరేషన్: అసెంబ్లీలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం కూటమి సర్కారు అరిగిపోయిన ఎన్నికల మేనిఫెస్టోలాగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల హామీల్లో పేర్కొన్న వివిధ పథకాలను మరోసారి చెప్పారే తప్ప వాటి అమలు గురించి మాట్లాడలేదన్నారు. కీలకమైన వ్యవసాయ మద్దతు ధరల కల్పన, గ్రామీణ పేదల ఉపాధి హామీ, పరిశ్రమల్లో భద్రతా చర్యలు వంటి అంశాల ఊసే లేదన్నారు. మెగా డీఎస్సీ ప్రకటన గురించి పేర్కొన్నారే తప్ప అది ఎప్పుడు ఆచరణలోకి వచ్చేది చెప్పలేదన్నారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ



వృద్ధుడి నుంచి అర్జీ తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా వేదికలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని, ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఇంజినీరింగ్, టిడ్కో, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, మెప్మా విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సీఆర్ రెడ్డి



కట్టమంచి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ట్రస్టు ప్రతినిధులు, విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి జిల్లావాసి కావడం చిత్తూరుకు గర్వకారణమని సీఆర్ రెడ్డి స్మారక ట్రస్ట్ సమన్వయకర్త ఎంవీ.శ్రీధర్ రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో సోమవారం కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతిని స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీవీ.రెడ్డి కాలనీలోని కట్టమంచి రామలింగారెడ్డి సమాధుల వద్ద నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ట్రస్ట్ సభ్యులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్య, సాహిత్య, రాజకీయ, సేవా రంగాల్లో సీఆర్ రెడ్డి తనదైన ప్రత్యేకత చూపారని కొనియాడారు. సీఆర్ రెడ్డి జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. రామలింగారెడ్డి స్వస్థలం చిత్తూరులో ఆయనకు మరింత గుర్తింపు తీసుకురావడానికి ట్రస్టు తరపున కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నిత్య బాబు, సహదేవ నాయుడు, అరుణ కుమారి, శ్రీనివాస్ మూర్తి, కృష్ణ సింగ్, రాజేష్, రంజిత్, అమర్నాథ్, జై కుమార్, ప్రసాద్ రెడ్డి, రమేష్, సి ఆర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం.. పేదలకు వరం



మాధవరంలో బీపీ పరీక్షలు చేస్తున్న వినయ్‌కుమార్

తవణంపల్లె: ఇంటింటికీ వైద్యం పేదలకు వరమని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మాధవరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 35 మందికి పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. గర్భిణులు 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.